సాక్షి విశాఖపట్నం

శుక్రవారం । 5 । జూలై । 2024



గిరి ప్రదక్షిణకు పక్కా ఏర్పాట్లు

గిరిప్రదక్షిణలో పాల్గొనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. 8లో



'జనసేన' అత్యుత్సాహం

జనసేన కార్యకర్తలు, నాయకులు అనధికారికంగా రంగా విగ్రహం ఏర్పాటు చేయడంతో జీవీఎంసీ అధికారులు అడ్డుకున్నారు. 8లో



యూపీఎస్సీ పరీక్షలకు భద్రత

యూపీఎస్సీ 7న నిర్వహిస్తున్న ఈపీఎఫ్‌వో, ఈఎస్ఐసీ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని డీఆర్వో ఆదేశించారు. 8లో

న్యూస్‌రీల్

హిందీ భాష అభివృద్ధికి కృషి చేయాలి



అధికార భాషపై సమీక్ష నిర్వహిస్తున్న కేంద్ర మంత్రిత్వశాఖ డైరెక్టర్ షా

సాక్షి, విశాఖపట్నం: హిందీ భాష అభివృద్ధికి ప్రతి ఒక్క ఉద్యోగి కృషి చేయాలని కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలవనరుల మంత్రిత్వ శాఖ డైరెక్టర్ మృత్యుంజయ్ షా సూచించారు. పోర్టులు మంత్రిత్వ శాఖ ప్రతినిధుల బృందం విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీఏ)ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా అధికార భాష అభివృద్ధి, అమలపై పోర్టు అధికారులతో సమీక్ష నిర్వహించారు. డైరెక్టర్ మృత్యుంజయ్ షా మాట్లాడుతూ అధికార భాషను విశ్వవ్యాప్తం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అవిశ్రాంతంగా కృషి చేస్తున్న తరుణంలో ప్రతి ఒక్కరూ దీన్ని బాధ్యతగా గుర్తెరగాలన్నారు. ఈ సమీక్షలో మంత్రిత్వ శాఖ సీనియర్ ట్రాన్స్‌లేషన్ ఆఫీసర్ రాకేష్‌కుమార్, పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబే తదితరులు పాల్గొన్నారు.

శంకర్ ఫౌండేషన్‌కి రెటీనా పరికరాల బహూకరణ



పరికరాలను ప్రారంభించి పరిశీలిస్తున్న ఎల్ఐసీ జెడ్‌ఎం శ్యామ్‌సుందర్

సింహాచలం: శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి ఎల్ఐసీ ఆఫ్ ఇండియా రూ.45 లక్షలు విలువ చేసే ఆధునిక రెటీనా పరికరాలను బహూకరించింది. ఆసుపత్రిలో గురువారం ఎల్ఐసీ సౌత్ సెంట్రల్ జోన్ హైదరాబాద్ జోనల్ మేనేజర్ ఎల్.కె.శ్యామ్‌సుందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.45 లక్షల సీఎస్ఆర్ నిధులతో కొనుగోలుచేసిన ఓక్యులర్ కోహెరెన్స్ టోమోగ్రఫీ(ఓసీటీ), ఫండస్ కెమెరా అనే పరికరాలను శంకర్ ఫౌండేషన్‌కి అందజేసినట్లు తెలిపారు. శంకర్ ఫౌండేషన్ జనరల్ మేనేజర్ కె.రాధాకృష్ణన్ మాట్లాడుతూ ఎల్ఐసీ అందజేసిన ఆధునిక పరికరాల ద్వారా కచ్చితమైన రోగ నిర్ధారణ, రెటీనాలో ఏదైనా అసాధారణను గుర్తించడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎల్ఐసీ సౌత్ సెంట్రల్ జోన్ జోనల్ మేనేజర్ పునీత్‌కుమార్, రీజినల్ మేనేజర్ ఉతుప్ దోసెఫ్, సీనియర్ డీఎం శారదా ప్రతాప్‌దాస్, మార్కెటింగ్ మేనేజర్ పి.రాజశేఖర్, శంకర్ ఫౌండేషన్ డీజీఎంలు పాల్గొన్నారు.

ఎస్‌బీ ఏసీపీగా ప్రభాకరరావు బాధ్యతల స్వీకరణ



విశాఖ సిటీ: విశాఖ స్పెషల్ బ్రాంచ్ ఏసీపీగా కె.ప్రభాకరరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ఇప్పటి వరకు ఏలూరు డీటీసీ డీఎస్పీగా విధులు నిర్వర్తించారు. రెండు క్రితం జరిగిన బదిలీల్లో ప్రభాకర్‌ను విశాఖకు బదిలీ చేస్తూ డీజీపీ ద్వారకా తిరుమలరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన గతంలో కూడా విశాఖలో పనిచేశారు.

ఏయూ దూరవిద్య పరీక్షల దరఖాస్తు గడువు పెంపు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రంలో పరీక్షల దరఖాస్తు, రిజిస్ట్రేషన్ గడువును ఈ నెల 10 తేదీ వరకు పొడిగించినట్లు కేంద్రం సంచాలకుడు ఆచార్య ఎన్.విజయ్‌మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ విధానంలో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రూ.5 వేల అపరాధ రుసుముతో ఈ నెల 15వ తేదీ వరకు తత్కాల్ విధానంలో దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. వీరికి విశాఖలో మాత్రమే పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

వాటర్ పోలో పోటీలకు సరయు, అభిరామ్



విశాఖ స్పోర్ట్స్: జూనియర్ నేషనల్ అక్వాటిక్ చాంపియన్‌షిప్‌లో భాగంగా నిర్వహించనున్న వాటర్‌పోలో పోటీలకు విశాఖ స్విమ్మర్లు పి.సరయు, పి.అభిరామ్ ఎంపికయ్యారు. ఈ పోటీలు ఇండోర్‌లో ఈనెల 7 నుంచి 11 వరకు జరగనున్నాయి. ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి జట్టు ఎంపిక పోటీల్లో వీరిద్దరూ పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారని జిల్లా స్విమ్మింగ్ సంఘం కార్యదర్శి వెంకట్‌రామ్ తెలిపారు.

జూకు కొత్త అతిథులు



స్పైరల్ మంకీస్



వన్యప్రాణులను వ్యాన్ నుంచి దించుతున్న సిబ్బంది

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కుకు గురువారం సాయంత్రం కొత్త వన్యప్రాణులు చేరుకున్నాయి. జూ అధికారులు జంతు మార్పిడి విధానం ద్వారా కొత్త వన్యప్రాణులను కొంతకాలంగా పలు రాష్ట్రాల్లో జూ పార్కుల నుంచి ఇక్కడకు తీసుకువస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా విశాఖ జూ అధికారులు గుజరాత్ రాష్ట్రం జామ్‌నగర్‌లో రాధాకృష్ణ టెంపుల్ ఎలిఫెంట్ వెల్ఫేర్ ట్రస్ట్‌తో జంతుమార్పిడి ఒప్పందం కుదుర్చుకున్నారు. అక్కడ నుంచి నుంచి గ్రీన్ వింగ్డ్ మెకావ్ రెండు జతలు, స్కార్లెట్ మెకావ్స్ రెండు జతలు, మిలటరీ మెకావ్స్ రెండు జతలు, మీడియం సల్ఫర్ క్రెస్టెడ్ కాకిటూ రెండు జతలు, స్పైరల్ మంకీస్ రెండు జతలు, కామన్ మార్మోసెట్స్ రెండు జతలు, మీర్‌కాట్ ఒక జత, రెడ్ నెక్డ్ వాల్లబీ ఒక జత వన్యప్రాణులను విశాఖ జూకి తీసుకువచ్చారు. వాటిని ప్రత్యేక కంటైనర్లలో రోడ్డు మార్గం ద్వారా తీసుకొచ్చినట్లు జూ క్యూరేటర్(ఎఫ్ఏసీ) జి.మంగమ్మ తెలిపారు. వాటికి బదులుగా ఇక్కడ నుంచి 2 మగ స్క్రిప్ట్ హైనాలు, ఒక జత హాగ్‌డీర్, 4 పెయింటెడ్ స్టార్క్, 4 గ్రే పెలికాన్, 10 జతలు నక్షత్ర తాబేళ్లు, ఒక ఆడ ఘరియల్, 2 ఆడ జంగిల్ క్యాట్, 10 దాలెలు(7 మగ, 3 ఆడ), ఒక జత వోల్ఫ్, ఒక జత గౌర్ జాతులను పంపించనున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అడిషనల్ పీసీసీఎఫ్ శాంతిప్రియ పాండే గురువారం జూని సందర్శించారు. కొత్తగా తీసుకువచ్చిన వన్యప్రాణులు, వాటి కోసం ఇక్కడ సిద్ధం చేసిన ఎన్‌క్లోజర్లను పరిశీలించారు. కొత్త వన్యప్రాణులను జాగ్రతగా తీసుకువచ్చిన జూ సిబ్బందిని ఆమె అభినందించారు.



మీడియం సల్ఫర్ క్రెస్టెడ్ కాకిటూ..

క్వారెంటైన్‌లో కొత్త వన్యప్రాణులు

జూకి కొత్తగా తీసుకువచ్చిన వన్యప్రాణులు ఆరోగ్యంగా ఉన్నాయని క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. వాటికి ఇక్కడ వాతావరణం అలవాటు కోసం కొద్ది రోజులపాటు క్వారెంటైన్‌లో ఉంచనున్నామన్నారు. క్వారెంటైన్ అనంతరం సందర్శకుల కోసం జూలో ఎన్‌క్లోజర్లలో విడిచిపెడతామన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఎన్‌క్లోజర్లను ఇప్పటికే సిద్ధం చేసినట్లు తెలిపారు.



స్కార్లెట్ మకావ్

సచివాలయాల్లో సేవలు బంద్!

- వారం రోజులుగా మొరాయించిన సర్వర్
- ధృవపత్రాల జారీ ఆలస్యం కావడంతో ప్రజల అవస్థలు
- సర్వర్ పేరుతో సేవలను ప్రభుత్వమే నిలిపేసిందంటూ విమర్శలు
- గత ప్రభుత్వ హయాంలో ప్రతి పనీ సచివాలయ పరిధిలోనే..
- ఇప్పుడు సచివాలయాల పనితీరుపై సర్వత్రా ఆందోళన



గంభీరంలో సచివాలయం

సాక్షి, విశాఖపట్నం/పెదగంట్యాడ: మహాత్ముని ఆశయ సాధనలో భాగంగా పల్లెలకే పరిపాలన తీసుకొస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విశేష సేవలందించిన సచివాలయాలు మూగబోతున్నాయి. సర్వర్లు పనిచేయకపోవడంతో ప్రజలకు అందాల్సిన సేవల్లో జాప్యం జరుగుతోంది. జిల్లాలోని సెక్రటేరియట్స్‌లో సేవలు అంతంతమాత్రంగానే అందుతుండటంతో ప్రజల్లో ఆందోళన మొదలైంది. గతంలో ప్రజలకు ఏ సమస్య వచ్చినా మండల కేంద్రానికి లేదా జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. కానీ గ్రామ/వార్డు సచివాలయాల వ్యవస్థ ఏర్పాటు చేయడం ద్వారా గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిజం చేశారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేస్తూ సేవలన్నింటినీ వారి చెంతకే తీసుకొచ్చారు. ప్రజలకు 35 విభాగాలకు సంబంధించి 545 ప్రభుత్వ సేవలను అందించే కార్యక్రమంతో ప్రతి సమస్య కూడా సచివాలయ సిబ్బంది పరిష్కరించడంలో ముఖ్యభూమిక పోషించారు. దేశంలో కీలకమైన ఆధార్ సేవలు కూడా సచివాలయాల్లో అందుబాటులోకి తీసుకురావడంతో ప్రజలు ఇబ్బందులకు దూరమయ్యారు. కానీ.. ప్రస్తుతం కథ మళ్లీ మొదటికొచ్చింది. సేవలందించిన సచివాలయాలు సైలెంట్‌గా మారిపోతున్నాయి. విశాఖ జిల్లాలో 607 గ్రామ, వార్డు సచివాలయాలున్నాయి. ఇందులో జీవీఎంసీ పరిధిలో 554 వార్డు సచివాలయాలుండగా మిగిలిన మండలాల పరిధిలో 53 గ్రామ సచివాలయాలున్నాయి. వార్డులు, గ్రామాల్లో నివసించే రైతు నుంచి కూలీ వరకు అన్ని వర్గాలకు అవసరమైన సేవలను నిర్ణీత కాల వ్యవధిలో అందించాల్సిన ఈ కార్యాలయాల్లో ఇప్పుడు సర్వర్లు పనిచేయడం లేదనే సమాధానమే వినిపిస్తోంది.

ప్రతి పనిలోనూ జాప్యం

ఐదు రోజులుగా ఏపీ సేవా పోర్టల్‌కు సంబంధించిన సర్వర్ పనిచేయడం లేదంటూ తమ వద్దకు వస్తున్న ప్రజలకు సచివాలయ సిబ్బంది చెబుతున్నారు. పాఠశాలలు, కళాశాలలు తెరుచుకుంటున్న సమయంలో వివిధ ధృవపత్రాలు అవసరమై ప్రజలు పెద్ద సంఖ్యలో సచివాలయాలకు వెళ్తున్నారు. కానీ ఇక్కడ మాత్రం ఎలాంటి సర్టిఫికెట్స్ జారీ చేయడం లేదు. సర్వర్ పనిచేయడం లేదనే సమాధానమే ఎక్కడికి వెళ్లినా వినిపిస్తోంది. ఐదు రోజులైనా సాంకేతిక సమస్య పరిష్కరించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సచివాలయాల వ్యవస్థ అంటే గిట్టని కొత్త ప్రభుత్వమే ఈ తరహా కుటిల రాజకీయాలకు పాల్పడుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సచివాలయాల్లో సేవలను నిర్వీర్యం చేస్తే క్రమంగా వాటిపై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లిపోతుందనీ.. తద్వారా వైఎస్సార్‌సీపీ ఏర్పాటు చేసిన వ్యవస్థను ప్రజలు మర్చిపోతారని ప్రభుత్వం భావిస్తోంది. ఎవరి సిఫార్సులు లేకుండా, రాజకీయ జోక్యం లేకుండా, పైసా లంచం లేకుండా అర్హతే ప్రామాణికంగా ఉన్న ఊరు, వార్డుల్లోనే ప్రజల ముంగిటకు ప్రభుత్వ సేవలు, పథకాలందించిన సచివాలయాలపై రాజకీయం తగదని ప్రజలు అంటున్నారు. సచివాలయాలు లేకపోతే ఐదేళ్ల క్రితం రోజులు మళ్లీ వస్తాయేమోనన్న ఆందోళన కూడా ప్రజల్లో వ్యక్తమవుతోంది. చిన్న ధృవపత్రానికే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగే రోజులు వస్తాయేమోనన్న భయం కూడా మొదలైంది. మరోవైపు సర్వర్ సమస్య పరిష్కృతమైతే సేవలు మొదలవుతాయని అధికారులు చెబుతున్నారు.

ధృవీకరణ పత్రాలు ఇవ్వకపోతే ఎలా?



మా అన్న కుమారుడు ఇటీవలే ఎంసెట్ రాశాడు. మంచి ర్యాంక్ సాధించాడు. కౌన్సెలింగ్ కోసం ఆన్‌లైన్ నమోదు చేసే సమయానికి కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు ఉండాలి. ఆ పత్రాలు కోసం సచివాలయానికి వెళ్తే సర్వర్ సమస్య ఉందని చెబుతున్నారు. సకాలంలో ధృవీకరణ పత్రాలు మంజూరు చేయకపోతే మా పిల్లల చదువులు ఏమి కావాలి. గతంలో అలా లేదు విద్యా సంవత్సరం ప్రారంభంలోనే వలంటీర్ ద్వారా కుల, ఆదాయ పత్రాలకు దరఖాస్తులు చేసుకునే వెసులుబాటు ఉండేది.

-పి.సంతోష్, నడుపూరు

వారం రోజుల నుంచి తిరుగుతున్నాను



నా కుమార్తె టెన్త్ పాసై ఇంటర్‌కు వచ్చింది. కళాశాలలో ఆమెకు అవసరమైన కుల, ఆదాయ, ధృవీకరణ పత్రాలు అడుగుతున్నారు. ఆ పత్రాలు ప్రస్తుతం సచివాలయాల్లో ఇవ్వడం లేదు. గతంలో సచివాలయంలోనే వీటిని మంజూరు చేసేవారు ఇప్పుడు ఎక్కడికి వెళ్లాలో ఎవరిని అగడాలో తెలియడం లేదు. నా కుమార్తె మాత్రం రోజు కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు చేయించారా లేదా అంటూ అడుగుతోంది. మా పరిస్థితి కాలేజీ యాజమాన్యానికి అర్థం కావటంలేదు. వారం రోజులుగా తిరుగుతున్నా సచివాలయంలో మళ్లీ ఆ పత్రాలు ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి ఏర్పడింది.

-ఎస్.బంగారయ్య, పెదగంట్యాడ

వైఎస్సార్ జయంతికి విస్తృత ఏర్పాట్లు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి, చిత్రంలో మాజీ మంత్రి అమర్‌నాథ్, మేయర్ హరివెంకట కుమారి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి, నాయకులు కె.కె.రాజు, చింతలపూడి

సాక్షి, విశాఖపట్నం: మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతిని ఘనంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాటు చేస్తున్నట్లు మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, పార్టీ డిప్యూటీ రీజినల్ కో–ఆర్డినేటర్ తిప్పల నాగిరెడ్డి, మేయర్ హరివెంకట కుమారి, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, సమన్వయకర్త కె.కె.రాజు, పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహిచారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ ఈ నెల 8న మహానేత వైఎస్సార్ జయంతి వేడుకలను జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రతీ వార్డులో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించి సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ ప్రజా తీర్పును గౌరవిస్తున్నామని.. ఓడిపోయిన చోటే విజయం కోసం అందరూ పనిచేయాలన్నారు. వైఎస్సార్ సీపీ ఐదేళ్ల పాలనలో జరిగిన మేలును ప్రజలు మరిచిపోరన్నారు. నాయకులు, కార్యకర్తలెవరూ అధైర్యపడొద్దని.. పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కటుమూరి సతీష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రవిరెడ్డి, రొంగలి జగన్నాథం, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు , జిల్లా ఉపాధ్యక్షురాలు పీలా ఉమారాణి, నియోజకవర్గ పరిశీలకులు శ్రీనివాస్‌రెడ్డి, ఫరూఖీ, పీలా వెంకటలక్ష్మి, పార్టీ ఉపాధ్యక్షురాలు పేడాడ రమణికుమారి, ముఖ్య నాయకులు ఆల్ఫా కృష్ణ, జాన్‌వెస్లీ, కొండా రాజీవ్, బి.పద్మావతి, అడ్డాల కృపాజ్యోతి, కార్పొరేటర్లు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, జోనల్ ఇన్‌చార్జిలు, జిల్లా అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

పకడ్బందీగా జగన్నాథుని రథోత్సవాలు



వివరాలు వెల్లడిస్తున్న ఈవో రాజగోపాల్‌రెడ్డి

డాబాగార్డెన్స్: టౌన్‌కొత్తరోడ్డులో వెలసిన జగన్నాథ స్వామి రథోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేసినట్టు ఆలయ ఈవో టి.రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఈ నెల 6న సాయంత్రం నేత్రోత్సవం, సుభద్రాదేవి శాంతి కల్యాణం నిర్వహించనున్నట్టు చెప్పారు. 7న సాయంత్రం 4.15 గంటలకు తొలి రథయాత్ర ప్రారంభించనున్నారని తెలిపారు. అనంతరం టౌన్‌కొత్తరోడ్డు నుంచి టర్నర్ సత్రం వరకు యాత్ర సాగనుందని, 8 నుంచి స్వామి దశవతారాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారని చెప్పారు. 18న తిరుగు రథయాత్ర ఉంటుందని, సింహాచలం, కూర్మనాథ ఆలయం, రామతీర్థం నుంచి స్వామికి పట్టు వస్త్రాలు నృసింహ, కూర్మ, రామావతారం రోజుల్లో అందజేస్తారని చెప్పారు. ఆలయ ప్రధాన అర్చకుడు పాణంగిపల్లి జగన్నాథాచార్యులు మాట్లాడుతూ రథయాత్రను పురస్కరించుకొని రోజూ మధ్యాహ్నం అన్నసమారాధన, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. సమావేశంలో అర్చకులు పి.రంగనాథాచార్యులు, యేడిద సురేష్‌బాబు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్ ప్రశాంతం





ఏయూ అవుట్ గేటు వద్ద, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వద్ద నినాదాలు చేస్తున్న విద్యార్థి సంఘాలు

డాబాగార్డెన్స్: నీట్–2024 పరీక్షా ఫలితాల్లో ఏర్పడ్డ అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలంటూ ఏఐఎస్ఎఫ్, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ(పీడీఎస్ఓ) తదితర విద్యార్థి సంఘాలు గురువారం చేపట్టిన విద్యా సంస్థల బంద్ విజయవంతమైంది. బంద్ కారణంగా పాఠశాలలు, కళాశాలలు మూత పడ్డాయి. విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ విశాఖ జిల్లా కార్యదర్శి యు నాగరాజు మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వ పాలనలో గత పదేళ్లుగా 60కి పైగా ప్రశ్నాపత్రాలు లీక్ కావడం విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటమాడడం దారుణమన్నారు. నీట్, యూజీసీ, నెట్ పరీక్ష పేపర్ లీకేజీపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, అసమర్థ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)ను రద్దు చేయాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చెయ్యాలని, బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నీట్‌ను ఆయా రాష్ట్రాల పరిధిలో మళ్లీ నిర్వహించి విద్యార్థుల భవిష్యత్ కాపాడాలన్నారు. నీట్ విద్యార్థులకు అండగా నిలుస్తున్న విద్యార్థి నాయకులపై పెట్టిన అక్రమ కేసులు తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు, పీడీఎస్ఓ జిల్లా కార్యదర్శి విశ్వనాథ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీను పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

సమన్వయంతో నిర్దేశిత లక్ష్యాలు సాధిద్దాం

కలెక్టర్ హరేంధిర ప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: జిల్లాలోని శాఖాధికారులు సమన్వయంతో పనిచేసి.. సక్రమంగా బాధ్యతలు నిర్వర్తించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం జిల్లా అధికారుల పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్దేశిత లక్ష్యాలను చేరుకుంటూ జిల్లాను ప్రగతి పథంలో నడిపించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల అమలు, వాస్తవ పరిస్థితులు, పెండింగ్ అంశాలు, శాఖల వారీగా నిర్వహిస్తున్న కార్యక్రమాలు, ప్రతిపాదనల నివేదికను మూడు రోజుల్లోగా సమర్పించాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. అక్కడ వచ్చే ఫిర్యాదులకు సకాలంలో పరిష్కరించాలన్నారు. ఇక నుంచి ఫైళ్లను ఈ–ఆఫీస్ ద్వారానే పంపాలని స్పష్టం చేశారు. దినపత్రికల్లో ప్రచురితమయ్యే ప్రతికూల వార్తలపై అధికారులు తక్షణమే స్పందించి అదే రోజు తగిన సమాధానం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో జేసీ కె.మయూర్ అశోక్, డీఆర్వో కె.మోహన్‌కుమార్, జెడ్పీ సీఈవో ఎం.పోలినాయుడు, డీఆర్డీఏ పీడీ శోభారాణి, డ్వామా పీడీ సందీప్, డీఈవో ఎల్.చంద్రకళ, డీఎస్‌వో సూర్యప్రకాశరావు, అధికారులు పాల్గొన్నారు.

విప్లవ వీరుడు.. మన్నెం సూరీడు

- జిల్లా వ్యాప్తంగా అల్లూరి జయంతి వేడుకలు
- నివాళులర్పించిన ప్రముఖులు



అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న మేయర్ హరి వెంకట కుమారి, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి, డిప్యూటీ మేయర్ సతీష్





అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి

డాబాగార్డెన్స్/మహారాణిపేట/విశాఖ సిటీ: జిల్లా వ్యాప్తంగా గురువారం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 127వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. బీచ్‌రోడ్డు పార్క్ హోటల్ జంక్షన్ వద్ద గల అల్లూరి విగ్రహానికి మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, జీవీఎంసీ టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, కార్పొరేటర్లు, జీవీఎంసీ అదనపు కమిషనర్లు పాల్గొన్నారు. కలెక్టరేట్ మీటింగ్ హాలులో అల్లూరి చిత్రపటానికి కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. జేసీ కె.మయూర్ అశోక్, డీఆర్వో కె.మోహన్‌కుమార్, ఏవో దేవ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. విశాఖ కమిషనరేట్‌లో అల్లూరి చిత్రపటానికి నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పూలమాల వేసి నివాళులర్పించారు. జాయింట్ సీపీ కె.ఫకీరప్ప, పోలీస్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ అల్లూరి పోరాటం యువతకు స్ఫూర్తి మంత్రమని పిలుపునిచ్చారు.

అల్లూరి పోరాటమే యువతకు స్ఫూర్తి



జనన గృహంలో ఏర్పాటు చేసిన అల్లూరి, అతని తల్లి సూర్యనారాయణమ్మ విగ్రహాలు



అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఆర్డీవో భాస్కరరెడ్డి తదితరులు

పద్మనాభం: దేశ స్వాతంత్ర్యం కోసం అల్లూరి సీతారామరాజు చేసిన పోరాటం నేటి యువతరానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని భీమిలి ఆర్డీవో భాస్కరరెడ్డి అన్నారు. పాండ్రంగిలో గురువారం జరిగిన అల్లూరి జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. అల్లూరి సీతారామరాజు వంటి వారు మరికొందరు ఉంటే..మనకు ఇంకా ముందుగానే స్వాతంత్ర్యం వచ్చేదన్నారు. పర్యాటక శాఖ రీజినల్ డైరెక్టర్ శ్రీనివాసు పాణి మాట్లాడుతూ పాండ్రంగిలో పుట్టిన అల్లూరి సీతారామరాజు దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి 27 ఏళ్ల వయసులోనే ప్రాణాలర్పించారన్నారు. భీమునిపట్నం మాజీ ఎమ్మెల్యే ఆర్.ఎస్.డి.పి.అప్పలనరసింహరాజు అల్లూరి జీవిత చరిత్ర గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో అల్లూరి విగ్రహానికి, జనన గృహంలో కొత్తగా ఏర్పాటు చేసిన అల్లూరి సీతారామరాజు, అతని తల్లి సూర్యనారాయణమ్మ విగ్రహాలను ఆవిష్కరించారు. జిల్లా పర్యాటక శాఖాధికారి జ్ఞానవేణి, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తనయుడు గంటా రవితేజ, తహసీల్దార్ ఎస్.వెంకటరావు, ఎంపీడీవో బి.శైలజ, పాండ్రంగి సర్పంచ్ వల్లి ఝాన్సీ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె.దామోదరరావు, మాజీ ఎంపీపీ కె.లీలావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అల్లూరి ఏకపాత్రాభినయం ఆహూతులను అలరించింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

- తీవ్ర గాయాలపాలైన మరో యువకుడు
- రాంపురం వద్ద రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో విషాదం



ఘటనా స్థలంలో మధు మృతదేహం



మధు(ఫైల్)

పెందుర్తి : మండలంలోని రాంపురం వద్ద అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. మరో యువకుడు తీవ్ర గాయాలతో అపస్మారకస్థితిలో ఉన్నాడు. గురువారం సాయంత్రం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఈ విషాదం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. రాంపురం గ్రామానికి చెందిన బాదిరెడ్డి మధుసూదనరావు(30) పాపకు తినుబండారాలు తీసుకువచ్చేందుకు ఇంటి నుంచి బైక్‌పై పినగాడి కూడలికి బయలుదేరాడు. అదే సమయంలో సబ్బవరం మండలం అజనగిరికి చెందిన పిల్ల అరవింద్ బైక్‌పై సబ్బవరం వైపు నుంచి పెందుర్తి వెళుతున్నాడు. ఇద్దరూ ఎదురెదురుగా వచ్చి బలంగా ఢీకొట్టుకోవడంతో రోడ్డుపై తుళ్లిపడిపోయారు. మధు తలకు తీవ్ర గాయమై రక్తస్రావంతో అక్కడికక్కడే మరణించాడు. అరవింద్‌కు కూడా రోడ్డుపై తల తగలడంతో తీవ్ర గాయమై అపస్మారకస్థితికి వెళ్లిపోయాడు. ఘటనపై సమాచారం అందుకున్న పెందుర్తి పోలీసులు ప్రమాదస్థలికి చేరుకుని మధు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. గాయాలతో ఉన్న అరవింద్‌ను చికిత్స నిమిత్తం 108లో ఆసుపత్రికి తరలించారు. సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు జరుగుతుంది.

క్షణాల్లో విషాదం

రాంపురంలో నివాసం ఉంటున్న బాదిరెడ్డి దేవుడుబాబు, రమణమ్మ దంపతుల కుమారుడు మధు స్థానికంగా ఓ పాఠశాలలో వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కె.కోటపాడు సమీపంలోని అలమండకు చెందిన అరుణతో ఏడాదిన్నర క్రితం మధుకు పెళ్లి అయింది. వీరికి ఆరు నెలల క్రితం పాప జన్మించింది. గురువారం సాయంత్రం పాపతో ఆడుకున్న మధు చిన్నారికి తినుబండారాలు తీసుకువచ్చేందుకు పినగాడి వెళ్లడానికి బైక్‌తో రోడ్డుపైకి వచ్చాడు. ఇంటి నుంచి రోడ్డుకు వచ్చిన క్షణాల్లోనే ప్రమాదం జరిగి మధు దుర్మరణం పాలవడంతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. అప్పటివరకు పాపతో ఆడుకున్న తన భర్త మరణంతో మధు భార్య అరుణ గుండెలవిసేలా రోదిస్తుంది. అందరితో మంచిగా ఉండే మధు మృతి చెందడంతో స్థానికులు కంటతడి పెట్టారు.

గిరిజనులకు మత్స్యసిరి

ముంచంగిపుట్టు : ఆంధ్రా, ఒడిశా సరిహద్దుల్లో గిరిజన మత్స్యకారుల వలకు భారీ సైజు చేపలు చిక్కుతున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మత్స్యగెడ్డలో వరదనీరు చేరడంతో చేపల వేట మొదలు పెట్టారు. దీనిలో భాగంగా ఏఓబీ సరిహద్దు ప్రాంతమైన ఓనమాల్ వద్ద మత్స్యగెడ్డలో గురువారం పది నుంచి 12 కిలోల గల బంగారు పాప రకం చేపలు చిక్కాయి. వీటిని కిలో రూ.200 చొప్పున ఒనకఢిల్లీ వారపు సంతలో విక్రయించారు.

యూపీఎస్సీ పరీక్షలకు కట్టుదిట్టమైన భద్రత

- 7న ఈపీఎఫ్‌వో, ఈఎస్‌ఐసీ పరీక్షల నిర్వహణ

మహారాణిపేట: యూపీఎస్సీ ఈ నెల 7న నిర్వహిస్తున్న ఈపీఎఫ్‌వో, ఈఎస్‌ఐసీ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. యూపీఎస్సీ నియమించిన పరిశీలకులు జిల్లాలోని పరీక్ష కేంద్రాలను శుక్రవారం పరిశీలిస్తారన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో యూపీఎస్సీ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై గురువారం సంబంధిత అధికారులు, సూపర్‌వైజర్లతో ఆయన సమీక్షించారు. ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ(ఈపీఎఫ్‌వో) పర్సనల్ అసిస్టెంట్స్, ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్(ఈఎస్‌ఐసీ) నర్సింగ్ ఆఫీసర్స్ పోస్టులకు సంబంధించిన ఈ నెల 7న పరీక్షలు జరుగుతాయన్నారు. ఆ రోజు ఉదయం 9.30 నుంచి 11.30 వరకు ఈపీఎఫ్‌వో పరీక్ష, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు ఈఎస్‌ఐసీ పరీక్ష ఉంటుందని, ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 14 కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. ఈ పరీక్షలకు 5,729 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. అభ్యర్థులు, రూట్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్లు యూపీఎస్సీ మార్గదర్శకాలు కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. పరీక్షల ఏర్పాట్లపై విద్యుత్, ఆర్టీసీ, జీవీఎంసీ, పోలీస్, రెవెన్యూ, పోస్టల్ తదితర శాఖల అధికారులకు ఆయన పలు ఆదేశాలిచ్చారు. సమావేశంలో పరీక్షల విభాగం సూపరింటెండెంట్ రవికుమార్ పాల్గొన్నారు.



విద్యుత్ వెలుగుల్లో క్లాక్‌టవర్

క్లాక్‌టవర్ జిగేల్

డాబాగార్డెన్స్: విశాఖ నగర సుందరీకరణలో భాగంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జగదాంబ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన క్లాక్‌టవర్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ప్రతీ గంటకు క్లాక్ నుంచి గంటల శబ్దం వచ్చేలా ఏర్పాట్లు చేశారు. రాత్రి వేళల్లో కూడా అందంగా ఉండేటట్టు క్లాక్‌టవర్‌పై కాంతి పడేలా అన్ని వైపులా విద్యుత్ దీపాలు అమర్చారు. నూతనంగా ఏర్పాటు చేసిన డివైడర్ మధ్యలో అందమైన పూల మొక్కలు నాటారు. మిరుమిట్లు గొలిపే విద్యుత్ కాంతులతో క్లాక్‌టవర్ మిలమిలలాడుతూ చూపర్లను విశేషంగా ఆకట్టుకుంటోంది. అటుగా వెళ్లేవారు ఈ దృశ్యాన్ని చూస్తూ అచ్చెరువొందుతున్నారు.

ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

గిరి ప్రదక్షిణకు పక్కా ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్
- అధికారులతో కలిసి గిరి ప్రదక్షిణ మార్గం పరిశీలన



గిరిప్రదక్షిణ ఏర్పాట్ల ప్రణాళికను కలెక్టర్‌కు వివరిస్తున్న దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులు

సింహాచలం : ఈనెల 20న జరిగే గిరిప్రదక్షిణలో పాల్గొనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధికారులకు సూచించారు. గిరి ప్రదక్షిణ ఏర్పాట్లపై గురువారం జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మ, జేసీ మయూర్ అశోక్, సింహాచలం దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి గిరి ప్రదక్షిణ జరిగే మార్గాన్ని పరిశీలించారు. సింహాచలంలోని కొండదిగువ స్వామివారి తొలిపావంచా, అడవివరం, అప్పుఘర్, లుంబిని పార్క్, సీతమ్మధార, కైలాసపురం, మాధవధార, మాధవస్వామి ఆలయం, గోపాలపట్నం మీదుగా తిరిగి సింహాచలం వరకు జరిగే గిరిప్రదక్షిణ రోడ్డు మార్గాన్ని పరిశీలించారు. గిరిప్రదక్షిణ రూట్ మ్యాప్‌ను సింహాచలం దేవస్థానం ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సింహాచలంలోని తొలిపావంచా వద్ద భక్తులు కొబ్బరికాయలుకొట్టే ప్రదేశాలను ఎక్కువగా ఏర్పాటు చేయాలని దేవస్థానం అధికారులకు సూచించారు. గిరిప్రదక్షిణ మార్గంలో రోడ్ల మరమ్మతులు, పారిశుధ్య పనులు, తాగునీరు, విద్యుత్ దీపాలు, మొబైల్ టాయిలెట్లు, లుంబినీ పార్క్ వద్ద బీచ్‌లో స్నానాలు ఆచరించే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ వివరించారు. అనంతరం సింహగిరి వెళ్లే రెండు ఘాట్‌రోడ్ల ప్రవేశ మార్గాలను కలెక్టర్ పరిశీలించారు. గిరిప్రదక్షిణ మార్గంలోను, లుంబినీ పార్క్ వద్ద ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు త్వరితగతిన చేపట్టాలని ఆదేశిచారు. భక్తులు ప్రశాంతంగా గిరిప్రదక్షిణ చేసేలా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని తెలిపారు. కార్యంకమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన ఇంజినీర్ రవి కృష్ణంరాజు, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, డీడీహెచ్ ఎం.దామోదరరావు, పర్యవేక్షక ఇంజినీర్లు కేవీఎస్.రవి, వినయ్‌కుమార్, రామ్మోహనరావు, వేణుగోపాల్, 2,3,8 జోనల్ కమిషనర్లు శైలజవల్లి, విజయలక్ష్మి, హేమావతి, ఈఈ రత్నాకర్‌రెడ్డి, ఆర్‌డీవోలు హస్సేన్ సాహెబ్, భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ప్రముఖులు

మహారాణిపేట: జిల్లా నూతన కలెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్‌ను గురువారం పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు తదితరులు కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

నేడు మిజోరం గవర్నర్ రాక

మహారాణిపేట: మిజోరం గవర్నర్ డాక్టర్ కె.హరిబాబు శుక్రవారం విశాఖ వస్తున్నారు. హైదరాబాద్ నుంచి విమానంలో శుక్రవారం రాత్రి 9.10 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి నేరుగా దసపల్లా సమీపంలోని ఉన్న సొంత ఇంటికి చేరుకుంటారు. 9వ తేదీ సాయంత్రం 5.20 గంటలకు మద్దిలపాలెం కాకతీయ కన్వెక్షన్ సెంటర్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. 14న మధ్యాహ్నం 3 గంటలకు విమానంలో గవర్నర్ కోల్‌కతా చేరుకుంటారు.

14న ఉక్కు విలీన దీక్ష

ఉక్కునగరం: ఉక్కు అధికారుల సంఘం (సీ) ఆధ్వర్యంలో ఈనెల 14న ఉక్కు విలీన దీక్ష చేయనున్నారు. ఉక్కు రంగాన్ని వ్యూహాత్మక రంగంలో ఉంచడానికి..సెయిల్, విశాఖ స్టీల్‌ప్లాంట్ పునఃవిలీనానికి, పూర్తి సామర్థ్యంతో స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి చేయడానికి తక్షణ బెయిలౌట్ ప్యాకేజీ కొరకు ఉక్కు అధికారుల సంఘం అభ్యర్థిస్తోంది. సీ భవన్ వద్ద ఆ రోజు ఉదయం 8 నుంచి రాత్రి 8 వరకు దీక్ష నిర్వహించనున్నారు. ఉద్యోగులందరూ దీక్షలో పాల్గోవాలని నిర్వాహకులు కోరారు.

7న స్కాలర్‌షిప్ పరీక్ష



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కరస్పాండెంట్ జె.వి.ప్రభాకర్

కొమ్మాది: హైదరాబాద్‌కు చెందిన లతారాజ ఫౌండేషన్ ప్రతిభావంతులైన డిగ్రీ విద్యార్థులను ఎంపిక చేసి స్కాలర్‌షిప్స్ అందించనుంది. ఈ మేరకు ఈ నెల 7న ఎండాడలోని ఎయిమ్స్ కాలేజీలో పరీక్ష నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ సెక్రెటరీ జె.వి.ప్రభాకర్ తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను గురువారం కళాశాలలో ఆవిష్కరించారు. ఆసక్తి గల డిగ్రీ విద్యార్థులు 98668 70179, 81426 57359కు సంప్రదించి.. పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ తల్లూరి రాజ, ప్రిన్సిపాల్ ఎం.పద్మారావు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ సమస్యల పరిష్కారానికి కార్యాచరణ సిద్ధం

- అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు నాగేశ్వరరావు



మాట్లాడుతున్న అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు

అల్లిపురం: అగ్రిగోల్డ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరుతూ ఎంపీలు, ఎమ్మెల్యేలకు పుష్పగుచ్ఛాలతో పాటు వినతిపత్రాలు అందజేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్ణయించింది. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈవీ నాయుడు అధ్యక్షతన అల్లిపురం సీపీఐ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో గౌరవ అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడారు. ఆరు నెలల వరకు కొత్త ప్రభుత్వానికి సమయం ఇచ్చి.. తదుపరి ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలన్నారు. అగ్రిగోల్డ్ సమస్యను త్వరితగతిన పరిష్కరించడానికి ఉన్నత స్థాయి కమిటీని అధికారులు, అసోసియేషన్‌తో కలిపి వేయాలని కోరదామన్నారు. లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, ఉత్తరాంధ్ర గౌరవాధ్యక్షుడు పి.కామేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి అచ్యుతరావు, సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, సనపల నర్సింహులు, అసోసియేషన్ నాయకులు జయసింహా, పి.గోవింద్, మజ్జి సూరప్పడు, మధు, తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యవహారం కేసులో విచారణ ముమ్మరం

సీతమ్మధార : కిడ్నీలు ఏర్పాటు చేస్తానని చెప్పి రూ.10లక్షలు కాజేసిన సంఘటనపై ద్వారకా పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. ఇప్పటికే వైద్యురాలు వాణి, ఆస్పత్రి అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ అనిల్‌పై కేసు నమోదు చేశారు. అనిల్‌ను సీఐ ఎస్.రమేష్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ ధర్మేంద్ర విచారణ చేశారు. కిడ్నీ వ్యవహారం ఎప్పటి నుంచి సాగుతుంది? ఇప్పటి వరకు ఇలా ఎంతమంది దగ్గర డబ్బులు వసూలు చేశారు? అనే కోణంలో కూడా విచారణ చేస్తున్నారు. మురళీనగర్‌కు చెందిన సత్యనారాయణ గోపి.. తన భార్య శారద లక్ష్మి అనారోగ్యానికి గురికాగా..సీతమ్మధారలోని ఎస్.ఆర్.ఐ ఆస్పత్రిలో నెఫ్రాలజిస్టు డాక్టర్ వాణిని సంప్రదించగా..కిడ్నీలు పాడయ్యాయని వెంటనే మార్చాలని చెప్పడంతో పాటు..కిడ్నీల కోసం ఆస్పత్రి అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ అనిల్‌ను కలిస్తే ఏర్పాటు చేస్తాడని సూచించారు. దీంతో అనిల్‌ను కలవగా..రూ.27 లక్షలు ఇస్తే కిడ్నీలు ఏర్పాటు చేస్తానని చెప్పడంతో తొలి విడతగా రూ.10 లక్షలు చెల్లించారు. డబ్బులు తీసుకున్న తరువాత ఎన్నిసార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో గోపీ పోలీసులను ఆశ్రయించారు. దీనిపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

తప్పిన ప్రమాదం



శంఖు నామ చక్రాలు కాలిపోవడంతో ఏర్పాటు చేసిన పరదా

కొమ్మాది : భీమిలి బీచ్ రోడ్డు రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో (టీటీడీ) ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శంఖు, నామ, చక్రాల విద్యుత్ దీపాలంకరణతో గల బోర్డు బుధవారం అర్ధరాత్రి దగ్ధమైంది. ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రమాదంలో నామ చక్రాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. అర్ధరాత్రి కావడంతో, ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

బియ్యంతో సరి!

మహారాణిపేట : రేషన్ వినియోగదారుల ఆశలపై కొత్త ప్రభుత్వం నీళ్లు చల్లింది. గత ప్రభుత్వం అందజేసిన బియ్యం, గోధుమ పిండి, పంచదారతో పాటు రాగిపిండి, కంది పప్పు, వంట నూనె అందజేస్తారని వినియోగదారులు భావించినా.. కూటమి ప్రభుత్వం ఉన్న సరకుల్లో కోత విధించింది. కేవలం బియ్యం, గోధుమ పిండి మాత్రమే పంపిణీ చేస్తోంది. ప్రస్తుతం అర్బన్ డీఎస్‌వో పరిధిలో మధురవాడ, ఆనందపురం, భీమిలి, పద్మనాభం, పెందుర్తి తదితర ప్రాంతాలున్నాయి. జిల్లాలో 5,12,619 కార్డులు, 625 చౌక ధరల డిపోలు ఉన్నాయి. 21 మంది చెక్కింగ్ ఇన్‌స్పెక్టర్లు, నాలుగు మండలాల డిప్యూటీ తహసీల్దార్లు ఈ విభాగంలో పనిచేస్తున్నారు.

జిల్లాలో డోర్ టు డోర్ పంపిణీ కోసం 310 వాహనాలను వినియోగిస్తున్నారు. రెండు, మూడు రేషన్ డిపోలకు కలిపి వాహనాల ద్వారా సరకులు అందిస్తున్నారు. ప్రస్తుతం యూనిట్‌కు నాలుగు కిలోలు చొప్పున బియ్యం పంపిణీ చేస్తున్నారు. జూలై కోటా కింద పంచదార పంపిణీ చేయడం లేదు. గత ప్రభుత్వ హయాంలో కార్డుదారుడికి అర కిలో పంచదార ఇచ్చేవారు. రాగి పిండి ఇస్తారమోనని ఎదురుచూసిన కార్డుదారులకు నిరాశే మిగిలింది. జూలై కోటాకు ఎలాంటి ఇండెంట్ లేదని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు ధర మండిపోతోంది. కందిపప్పు కోసం ఎదురుచూసిన వారికీ చుక్కెదురైంది.

7న నారాయణ్ సేవా శిబిరం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంస్థాన్ డైరెక్టర్ భగవాన్ ప్రసాద్, నిర్వాహకులు

డాబాగార్డెన్స్: ఉదయ్‌పూర్‌కు చెందిన నారాయణ్ సేవా సంస్థాన్ ఆంధ్రప్రదేశ్‌లో గల దివ్యాంగులకు ఉచిత నారాయణ్ లింబ్, కాలిపర్స్ ఫిట్టింగ్‌కై ఈ నెల 7న విశాఖలో పెద్ద ఎత్తున శిబిరం ఏర్పాటు చేసినట్టు సంస్థాన్ డైరెక్టర్ భగవాన్ ప్రసాద్ తెలిపారు. గురువారం నగరంలోని ఓ హోటల్‌లో కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోర్టు కళావాణి ఆడిటోరియం విశ్వనాథ్ కన్వెన్షన్ వేదికగా ఆ రోజు ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ శిబిరం ఉంటుందని చెప్పారు. ఇప్పటికే 500 మందికి పైగా దివ్యాంగులు కొలతలు ఇచ్చారని, వీరిలో 350 మంది రోడ్డు ప్రమాదం, ఇతర ప్రమాదాల కారణంగా చేతులు, కాళ్లు కోల్పోయి వైకల్యానికి గురైన వారు ఉన్నారని తెలిపారు. లింబ్, కాలిపర్స్ ఫిట్ చేసిన తర్వాత నడక కోసం సంస్థాన్ వ్యక్తులచే శిక్షణ అందజేయనున్నట్టు వెల్లడించారు. ఉదయ్‌పూర్ నుంచి సంస్థాన్ అధ్యక్షుడు ప్రశాంత్ అగర్వాల్‌తో పాటు స్థానిక సేవా సంస్థలు సేవా భారతి, వనవాసి కల్యాణ్ ఆశ్రమం, గుజరాతీ సమాజ్, మార్వాడీ సమాజ్, మార్వాడీ యువ మంచ్, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ్ కల్యాణ్ సహా 20కి పైగా సామాజిక సేవా సంస్థలు, సొసైటీలు పాల్గొంటున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సంస్థాన్ విశాఖ శాఖ కో ఆర్డినేటర్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

జనసేన నాయకుల అత్యుత్సాహం

- అనుమతులు లేకుండా రంగా విగ్రహం ఏర్పాటు
- అడ్డుకున్న జీవీఎంసీ అధికారులు

కొమ్మాది: జనసేన కార్యకర్తలు, నాయకులు అత్యుత్సాహం ప్రదర్శించారు. అనధికారికంగా వంగవీటి రంగా విగ్రహం ఏర్పాటు చేయడంతో జీవీఎంసీ అధికారులు అడ్డుకున్నారు. వివరాలివీ.. జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఎండాడ చెరువు(ట్యాంక్‌బండ్) వద్ద బుధవారం అర్ధరాత్రి జనసేన స్థానిక నాయకులు, కార్యకర్తలు వంగవీటి రంగా విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. జీవీఎంసీ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా రాత్రికి రాత్రే విగ్రహాన్ని ఏర్పాటు చేయడంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. గురువారం వంగవీటి రంగా వర్ధంతి సందర్భంగా ఈ విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు సిద్ధమయ్యారు. ఈ సమాచారం అందుకున్న జీవీఎంసీ అధికారులు ఈ కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. అనుమతులు లేకుండా జీవీఎంసీ పార్కు స్థలంలో విగ్రహాన్ని ఏర్పాటు చేయవద్దన్నారు. అనుమతులు తెచ్చుకున్న తర్వాత ఏర్పాటు చేసుకోవాలని.. ప్రస్తుతానికి ఇక్కడ ఏర్పాటు చేసిన విగ్రహాన్ని తరలించాలని ఆ పార్టీ నాయకులకు స్పష్టం చేశారు.

ఆస్తి కోసమే సోదరుడి హత్య

- సున్నం సతీష్ హత్య కేసులో
- నిందితులిద్దరికీ రిమాండ్
- విలేకరుల సమావేశంలో డీఎస్పీ సత్యనారాయణ వెల్లడి



విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సత్యనారాయణ

యలమంచిలి రూరల్ : సమాజంలో నేర ప్రవృత్తి కారణంగా మానవ సంబంధాలు రోజురోజుకూ దిగజారి పోతుండడం ఆందోళన కలిగిస్తోందని పరవాడ డీఎస్పీ కె.వి. సత్యనారాయణ అభిప్రాయపడ్డారు. యలమంచిలిలో గత నెల 27న ఆస్తి కోసం సొంత సోదరుడినే కిరాతకంగా హతమార్చిన ఘటన ఈ కోవలోకే వస్తుందన్నారు. గురువారం యలమంచిలి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంచలనం కలిగించిన స్వర్ణకారుడు సున్నం సతీష్ కుమార్(38) హత్య కేసు వివరాలను ఆయన వెల్లడించారు. ఈ నెల 2న హతుడి తల్లి సున్నం రాజా నాగమణి తన కుమారుడు సతీష్ కుమార్ కనిపించడం లేదని పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా క్రైం నెంబరు 129/2024తో ఎస్‌ఐ పాపినాయుడు వ్యక్తి అదృశ్యం కేసు నమోదు చేశారన్నారు. కాగా 3వ తేదీ ఉదయం 9.30 గంటలకు పట్టణంలోని తులసీనగర్ వీఆర్వో మహమ్మద్ ఆరిఫ్ పట్టణ పోలీసులకు మరో ఫిర్యాదు ఇచ్చారు. హతుడు సున్నం సతీష్ కుమార్ సోదరులు సున్నం సాయి మనోజ్ కుమార్, దేవులపల్లి రాజేష్‌లు వీఆర్వో వద్దకు వచ్చి తమ సోదరుడు సతీష్‌కుమార్‌ను హత్య చేసి పాతిపెట్టినట్టు నేరాన్ని అంగీకరించి, వాంగ్మూలాలు ఇచ్చారని వీఆర్వో తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు వ్యక్తి అదృశ్యం కేసును హత్య కేసుగా మార్చి చేసి యలమంచిలి సీఐ దర్యాప్తు ప్రారంభించారన్నారు. నిందితులను అరెస్టు చేయడం జరిగిందన్నారు. పోలీసులు హతుడి మృతదేహాన్ని బయటకు తీయించి, శవ పంచనామా, పోస్టుమార్టం పూర్తి చేయించారన్నారు. ఈ కేసును సీఐ షేక్ గఫూర్, పట్టణ ఎస్‌ఐ పాపినాయుడు, ట్రాఫిక్ ఎస్‌ఐ రామకృష్ణ, ఏఎస్‌ఐ చెల్లారావు, సిబ్బంది ఒక్క రోజులోనే ఛేదించారని, వారి కృషిని అభినందించారు. నిందితులపై రౌడీ షీటు తెరుస్తామన్నారు. కేసు దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసి పూర్తి ఆధారాలను న్యాయస్థానం ముందుంచి నిందితులకు చట్ట ప్రకారం శిక్ష పడేలా చూస్తామని డీఎస్పీ చెప్పారు.

నిందితులకు 14 రోజుల రిమాండ్

హత్య కేసులో అరెస్టు చేసిన ఏ1 గా సున్నం సాయి మనోజ్ కుమార్, ఏ2 గా దేవులపల్లి రాజేష్‌లను గురువారం సాయంత్రం యలమంచిలి ఏజేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపర్చగా వారిద్దరికీ న్యాయమూర్తి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో యలమంచిలి సబ్ జైల్‌కు తరలించారు.

బండారు ఎదుటే బయటపడ్డ బండారం

- దేవరాపల్లిలో టీడీపీ నాయకుల కుమ్ములాట
- పాత, వలస నేతల మధ్య ఆధిపత్య పోరు

దేవరాపల్లి: దేవరాపల్లి టీడీపీలో వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. ఆధిపత్య పోరుతో గురువారం కుమ్ములాటకు దిగారు. రైవాడ అతిథి గృహంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి ఎదుటే బాహాబాహీకి దిగడం గమనార్హం. ఒకరిపై మరొకరు పరుష పదజాలంతో దుర్భాషలాడుతూ పరస్పరం దాడులు చేసుకున్నారు. అక్కడే ఉన్న ఎమ్మెల్యే వీరి తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అసభ్య పదజాలంతో రెచ్చిపోయిన దేవరాపల్లికి చెందిన టీడీపీ నాయకుడిపై ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. పార్టీ మండల సమావేశం నిర్వహించి సదరు నాయకుడిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించినట్లు తెలిసింది.

వివాదం ఇలా....

దేవరాపల్లిలో ఎన్నికలకు కొద్ది రోజుల ముందు వేరే పార్టీ నుంచి టీడీపీలోకి వలస వచ్చిన నాయకుడి తీరుతో వర్గ పోరు మొదలైంది. ఆ వలస నేత మండలంలో ఆధిపత్యం చెలాయించాలని చేసిన ప్రయత్నాలకు పాత నాయకులు ఎక్కడికక్కడ అడ్డుకట్ట వేస్తుండటంతో విభేదాలు ముదిరాయి. ఐదేళ్ల పాటు ప్రతిపక్షంలో కూర్చొని పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన తమను అణగదొక్కేందుకు.. తాజాగా వలస వచ్చిన నేత కుట్రలు పన్నుతున్నారని పాత టీడీపీ నాయకులంతా గుర్రుగా ఉన్నారు. దేవరాపల్లిలో జలజీవన్ మిషన్ పథకంలో ఓ వీధికి ఇంటింటి కుళాయి పనులను సదరు వలస నేత అడ్డగింపజేశారని పాత టీడీపీ నాయకులు కొందరు గురువారం ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. వలస నేత తనకు అనుకూలంగా ఉన్న పాత టీడీపీ కార్యకర్తను ఉసిగొల్పడంతో.. ఆయన రైవాడ అతిథి గృహానికి చేరుకొని ఎమ్మెల్యే ఎదుటనే ఇష్టానుసారం తిట్ల పురాణం మొదలు పెట్టాడు. దీంతో మండల టీడీపీ కీలక నాయకుడు సముదాయించే ప్రయత్నం చేశాడు. అయితే సముదాయించిన నాయకుడిపై దాడి చేసేందుకు ప్రయత్నించగా కార్యకర్తపై మండల టీడీపీ నాయకుడు చేయి చేసుకున్నట్లు సమాచారం. వలస నేత ఉసిగొల్పడంతోనే సదరు కార్యకర్త ఉద్దేశపూర్వకంగా వివాదం సృష్టించారని పాత టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ వివాదంపై చర్చించేందుకు శుక్రవారం పార్టీ మండల సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.73,090
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.67,000
వెండి(కిలో):	రూ.97,500

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)	
బ్రాయిలర్ (లైవ్)	: రూ.130
స్కిన్	: రూ.230
స్కిన్‌లెస్	: రూ.240

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)	
విశాఖ	550.00
విజయనగరం	554.00
శ్రీకాకుళం	554.00